


కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

# ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన

జనగాం ఎమ్మెల్యే, విద్యాజ్యోతి ఇంజినీరింగ్ విద్యా సంస్థ చైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్, జనవరి 3: విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యనందిస్తూ ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నట్లు జనగాం ఎమ్మెల్యే, బీజేఐఈటీ విద్యా సంస్థ చైర్మన్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూలోని విద్యాజ్యోతి ఇంజినీరింగ్ కళాశాల 25 వసంతాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో బుధవారం సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 25 ఏండ్ల క్రితం నాలుగు బీటెక్ కోర్సులు 180 మంది విద్యార్థులతో ఈ విద్యా సంస్థ ప్రారంభమైందన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో విద్యాబోధన చేయించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయిబాబారెడ్డి, డీన్ పద్మజా, సీనియర్ అడ్మినిస్ట్రేటర్ వెంకటాచలం పాల్గొన్నారు.

# మహిళలను గౌరవించిన చోటే ప్రగతి



సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి సీతక్క, జాజుల శ్రీనివాస్‌గౌడ్

**మంత్రి సీతక్క**

**రవీంద్రభారతి, ప్రెస్‌క్లబ్‌లలో సావిత్రిబాయి పూలే జయంతి**

**ఘనంగా నివాళులర్పించిన మంత్రి..**

రవీంద్రభారతి, జనవరి 3: ఏ దేశంలోనైతే మహిళలు గౌరవించబడుతారో ఆ దేశం అభివృద్ధి చెందుతుందని మంత్రి సీతక్క అన్నారు. సావిత్రిబాయిపూలే 193వ జయంతి ఉత్సవాలను బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మణిమంజరి సాగర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సావిత్రిబాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ... సావిత్రిబాయిపూలే స్త్రీల విజ్ఞానం కోసం నిరంతరం పోరాటం చేసిన గొప్ప సామాజిక యోధురాలని కొనియాడారు. చదువుల తల్లి సావిత్రిబాయిపూలే అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అని, ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేసి ఎంతో మందికి విజ్ఞానాన్ని అందించిన దివ్యజ్యోతి అని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం కొనియాడారు. అంతకు ముందు పలువురు సామాజిక ఉద్యమకారులకు సావిత్రిబాయిపూలే అవార్డులతోపాటు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాటికొండ విక్రంగౌడ్, మణిమంజరి సాగర్, చిన్న శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

### సావిత్రిబాయి పూలే నాకు ఆదర్శం..

ఖైరతాబాద్, జనవరి 3 : భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను తాను ఆదర్శంగా తీసుకున్నానని మంత్రి సీతక్క తెలిపారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భారతీయ ఓబీసీ సమాఖ్య ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు విద్యనభ్యసిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారంటే..అందుకు సావిత్రిబాయి పూలే ఆదర్శమన్నారు. తన జీవితంలోనూ సావిత్రిబాయి పూలే స్ఫూర్తి నింపిందని, ఉద్యమాల నుంచి బయటకు వచ్చిన తర్వాత చదువును ఎంచుకున్నానని తెలిపారు. ఎంఏ, ఎల్‌ఎల్‌బీ, పీహెచ్‌డీ చదివానని, ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్‌ఎల్‌ఎం చేస్తున్నానని చెప్పారు. అనంతరం ఉత్తమ టీచర్లు, రచయితలు, వైద్య నిపుణులు, సామాజిక కార్యకర్తలను సత్కరించారు.

# మస్తిష్కం.. మందగమనం..



**మనుషుల్లో ఏటికేడూ అంతరిస్తున్న అనంతమైన జ్ఞాపకశక్తిమారుతున్న 'స్మార్ట్' జీవన శైలిలో పెరిగిపోతున్న 'గజినీలు' సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో తగ్గిపోతున్న సహజత్వం పట్టుమని పది మంది నంబర్లూ గుర్తుంచుకోలేని దైన్యం రెండంకెలను లెక్కించేందుకూ క్యాలిక్యులేటర్ల ఆశ్రయం మెదడులో ఉండాల్సిన స్టోరేజీ అంతా మెమొరీ కార్డుల్లోకి.. ఇప్పటికైనా మేల్కోవాలంటున్న వైద్య నిపుణులు**



న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ : ఇటీవలే పీజీ పూర్తి చేసిన రామ్.. ఎంతో ఉత్సాహంతో మంచి ఉద్యోగం కోసం నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఇంటర్వ్యూకు వెళ్లాడు. టిక్‌టాక్‌గా రెడీ అయి మంచిగా టక్ వేసుకొని నీట్‌గా టై కట్టుకొని స్మార్ట్ బాయ్‌లా ఉత్సాహంగా వెళ్లాడు. రిసెప్షనిస్ట్ అతడి పేరును పిలిచి లోపలికి పంపే వరకూ చేతిలో ఫైలును ఊపుతూ, మాంచి ఎగ్జైటింగ్‌ను ప్రదర్శిస్తూ కన్పించాడు. ఇంతలో అతడి వంతు రానే వచ్చింది. రిసెప్షనిస్ట్ పిలవనే పిలిచింది. మాంచి ఊపుగా, ఉత్సాహంగా చాంబర్లోకి వెళ్లిన రామ్‌ను ఇంటర్వ్యూయర్ విష్ చేశాడు. ప్లీజ్ టేక్ యువర్ సీట్ అని చెప్పడంతో రామ్ హుందాను ప్రదర్శిస్తూ సీట్లో కూర్చున్నాడు. అంతకు ముందే అతడు పంపిన రెజ్యూమ్‌ను పరిశీలించిన.. ఇంటర్వ్యూయర్ సర్టిఫికెట్ల ఫైల్ ఏదంటూ అడిగారు. ఠకీమని ఫైల్ తీసి చేతికిచ్చాడు రామ్. ఆ ఫైల్‌ను, అతడి రెజ్యూమ్‌ను టేబుల్‌పైన పక్కకు పెట్టిన ఇంటర్వ్యూయర్.. తడుముకోకుండా, మొబైల్ చూడకుండా అతడి బంధువులు, స్నేహితుల్లోని ఓ ఐదుగురి ఫోన్ నంబర్లు చెప్పమని అడిగాడు. ఊహించని ఆ ప్రశ్నకు తన నంబర్ తప్ప మరెవ్వరి నంబరూ చెప్పలేకపోయాడు 'స్మార్ట్' రామ్. తానెలాగూ సెలెక్ట్ కానన్న నిరుత్సాహంతో ఉసూరుమంటూ ఆ కంపెనీ మెట్లు దిగాడు రాక్‌లా ఉండే రామ్. ఇది ఈ ఒక్క రామ్ పరిస్థితి మాత్రమే కాదు.. దాదాపు అందరిదీ..

ఆధునిక యుగంలో సాంకేతిక పరిజ్ఞానం ఆసాంతం పెరుగుతుండడంతో మనిషి తన సహజ సిద్ధమైన, అనంతమైన జ్ఞాపకశక్తిని అంతే వేగంగా కోల్పోతున్నాడు. అపరిమితంగా విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంతో మనిషి తన మెదడుకు పదును పెట్టడాన్ని మానేస్తున్నాడు. దాని స్థానంలో టెక్నాలజీపై ఆధారపడుతున్నాడు. ఫలితంగా మెదడు మొద్దుబారిపోతోంది. మనిషి తన మెదడుకు పని చెప్పకుండా యాంత్రిక జీవనంలో ప్రతి విషయానికీ టెక్నాలజీపై ఆధారపడుతుండడంతో సహజంగానే తనకు తానుగా తన మస్తిష్కం మసకబారేలా చేసుకుంటున్నాడని సైకాలజిస్టులు చెబుతున్నారు. నిత్యం వర్తకంలో తలమునకలయ్యే వ్యాపారులు తప్ప చాలా మంది క్యాలిక్యులేటర్‌పైనే ఆధారపడుతున్నారని, చాలామంది యువకులు కూడా 'గజినీ'ల్లా ప్రతి ఐదు నిమిషాలకూ జ్ఞాపకశక్తిని కోల్పోయేలా తాయరవుతున్నారని మనోవైజ్ఞానిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి చిన్నపిల్లల్లో మరింతగా ఉంటే మున్ముందు వారిలో విజ్ఞానం కూడా కుచించుకపోయే ప్రమాదం ఉందని చెబుతున్నారు.



మనం చదివే విషయమైనా, చూసే దృశ్యమైనా, వినే అంశమైనా మెదడులోని స్మృతి పీటికల్లో నిక్షేపంగా ఉంటుంది. ముందు తరాల వారంతా స్వతహాగా ఆలోచనాపరులు, మెదడును ఉపయోగించి సమాచారం గ్రహించడమో, నిక్షిప్తం చేసుకోవడమో చేసేవారు. మెదడులోని స్మృతి పీటికల్లో కొంత అసంఖ్యాకమైన


### సాంకేతికతతో మొద్దుబారుతున్న మెదడు..

జ్ఞాపకశక్తి ఉంటుంది. ఇది కంప్యూటర్‌లో వినియోగించే మెమొరీ కార్డుల కంటే ఎన్నో రేట్లు అధికం. కానీ.. మనం పని కల్పించని కారణంగా ఇప్పుడది క్రమంగా మొద్దుబారిపోతోంది. మనిషి మెదడులోని పదిశాతం సామర్థ్యాన్ని వినియోగించుకున్నా.. కంప్యూటర్ కన్నా వేగంగా పని చేయగలమని, అద్భుతాలు సృష్టించగలమని నిపుణులు చెబుతున్నారు. కానీ.. నేటి మనుషులు స్మృతి పీటికలను మూడుశాతం కూడా వినియోగించడం లేదని పరిశోధనల్లో స్పష్టమవుతోందని చెబుతున్నారు.

### పిల్లలకు సరైన ఆహారం తప్పనిసరి..

పాఠశాలలకు వెళ్లే పిల్లల జ్ఞాపకశక్తి ఎలా ఉందో తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి. ఒకవేళ జ్ఞాపకశక్తి అంతంత మాత్రంగా ఉంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. లేకుంటే వయసు పెరిగేకొద్దీ అనేక సమస్యలు ఎదురవుతుంటాయి. అయితే, పిల్లలు తీసుకునే ఆహారం వారి ఆరోగ్యానికే కాకుండా మెదడుకు కూడా మేలు చేసేలా ఉండాలని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు. ముఖ్యంగా పాలు, పాల ఉత్పత్తులు అధికంగా ఉండే పదార్థాలు క్రమం తప్పకుండా అందించాలని సూచిస్తున్నారు. తద్వారా ప్రొటీన్లు, క్యాల్షియం, పొటాషియం తదితర విటమిన్లు సమృద్ధిగా లభించే అవకాశం ఉంది. నేరేడు పండ్లను వాటి సీజన్‌లో సేకరించి పిల్లలకు తినిపిస్తే వారిలో జ్ఞాపకశక్తి మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్రతి రోజూ ఉడకబెట్టిన కోడిగుడ్డు, బాదం, పిస్తా వంటి డ్రై ఫ్రూట్లను, టమాట, క్యారెట్, బీన్స్ వంటి కూరగాయలను, ఇతర ఆకుకూరలను పిల్లలకు అందిస్తే వారిలో సులభంగానే జ్ఞాపకశక్తి పెంపొందుతుందని న్యూట్రీషన్లు సూచిస్తున్నారు.

### అతిగా అలవాటుపడితే అనర్థమే..



టెక్నాలజీపైనే పూర్తిగా ఆధారపడడం, దానికి అతిగా అలవాటు పడడం అనర్థాలకు దారితీస్తుంది. ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం. అయితే సహజత్వం పూర్తిగా కోల్పోకుండా జాగ్రత్త వహించాలి. ప్రతి ఒక్కరిలో షార్ట్‌టైం మెమొరీ, లాంగ్‌టైం మెమొరీ అనేవి ఉంటాయి. నిత్యం సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, క్యాలిక్యులేటర్ల వంటి సాధనాలపై ఆధారపడితే కొంతకాలం తరువాత మనం స్వతహాగా ఆలోచించే విధానాన్ని మర్చిపోతాం. అది ఎంతో ప్రమాదకరం. ముఖ్యంగా చిన్న వయసు నుంచే సాధ్యమైనంతగా శారీరక శ్రమతో కూడిన ఆటలను తప్పకుండా ఆడాలి. అదే విధంగా చిన్నపాటి లెక్కలను మెమొరీ సాయంతో చేసే విధంగా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. నిత్యం సాంకేతిక పరిజ్ఞానంతోనే గడిపితే నరాల సంబంధిత వ్యాధులు కూడా వచ్చే ప్రమాదముంది.

–డాక్టర్ కేసగాని రాజశేఖర్‌గౌడ్, ఎండీ, జనరల్ మెడిసిన్